జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com







✳ 4 కోట్ల రూపాయల విలువ చేసే భూమి స్వాహా ✳ 2023లో కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ ✳ బతికి ఉన్న భూ యజమాని మృతి చెందినట్టు దొంగ సర్టిఫికెట్ ✳ తప్పుడు వారసత్వ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ ✳ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు ✳ గుట్టురట్టు చేసిన పోలీసులు ✳ 13 మందిపై కేసు, 8మంది అరెస్టు ✳ కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

## దొంగపత్రాలతో.. తమ్మినేని కుటుంబం..

# భూ కబ్జా!







శ్రీకాకుళం క్రైం, జులై 19 (వార్త): మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సీతారాం, భార్య వాణి, కుమారుడు శ్రీరామ చిరంజీవి నాగ్‌తో పాటు మరికొందరు కలిసి దొంగపత్రాలు సృష్టించి నాలుగు కోట్ల రూపాయలు విలువ చేసే తన భూమిని కబ్జా చేశారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిజాలు వెలుగులోకి తీశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. భూ యజమాని బతికుండగానే చనిపోయినట్టుగా మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, నకిలీ వారసులను చూపి తప్పుడు పత్రాలతో తమ్మినేని కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిలో సబ్ రిజిస్ట్రార్ హస్తం కూడా ఉందని తెలిపారు. 13మందిపై కేసు నమోదు చేశామని, ఎనిమిది మందిని అరెస్టు చేశామని, మిగతా వారిని త్వరలో అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి నకిలీ రబ్బరు స్టాంపులు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చాపురం గ్రామ పంచాయతీ బలగ పరిధిలో సర్వే నంబర్ 35/13లో ఉన్న 84, 85, 86 ప్లాట్లను (900 గజాల స్థలం) అంధవరపు గోవిందరాజులు అనే వ్యక్తి నుంచి కట్టా కనకలింగేశ్వరరావు అనే వ్యక్తి 1988, 1992లో రెండు దఫాలుగా కొనుగోలు చేశారు. కనక లింగేశ్వరరావు కుటుంబం ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆ స్థలం చాలా కాలంగా ఖాళీగా ఉండడంతో దీనిపై కొందరు కన్నేశారు. కనక లింగేశ్వరరావుకు భూమిని విక్రయించిన అంధవరపు గోవిందరాజుల లింక్ డాక్యుమెంట్‌లను పైకి తీశారు. గోవిందరాజులు బతికి ఉండగానే.. ఆయన చనిపోయినట్లు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారు. గోవిందరాజులుకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఒడిశాలోని జయపుర్ ప్రాంతానికి చెందిన అడబాల రజనిని తెరపైకి తెచ్చారు. 'ఎ.రజని'గా రికార్డుల్లో చూపించి గోవిందరాజులకు ఏకైక వారసురాలుగా రెవెన్యూ అధికారుల నుంచి వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేయించారు. వీటితో తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలను రూపొందించారు. 2023లో ఆమదాలవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తమ్మినేని సీతారాం కుమారుడు తమ్మినేని చిరంజీవి నాగ్‌కు విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. తమ్మినేని సీతారాంకు చెందిన ఆమదాలవలసలోని ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్న నలుగురు లెక్చరర్లను ఇందుకు సాక్షులుగా సంతకం చేయించారు. ఇటీవల ఆ స్థలానికి ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా.. అసలు యజమాని కనకలింగేశ్వరరావు కుమారుడు కట్టా జైకిశోర్ పోలీసులను ఆశ్రయించారు. తమ వద్ద ఉన్న ఒరిజనల్ పత్రాలను పోలీసులకు సమర్పించారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి భూకబ్జా గుట్టు రట్టు చేశారు. ఈ ఘటనలో మొత్తం 13 మంది ఉన్నట్టు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎస్పీ తెలిపారు. వీరిలో ఏ1 అడబాల రజని, ఏ2 తెలుగు సతీశ్ కుమార్, ఏ3 సాలిపల్లి లక్ష్మణరావు, ఏ8 ముదాడ్ల ఉపేంద్ర కుమార్, ఏ9 జెగురిపాటి ఉపేంద్రరావు, ఏ10 మామిడి గోపాలకృష్ణ, ఏ11 సాంబాన సాంబశివరావు, ఏ12 కూన పెద్దిరాజు (డాక్యుమెంట్ రైటర్)ను అరెస్టు చేశామన్నారు. తమ్మినేని కుటుంబ సభ్యుల సహకారంతో డాక్యుమెంట్ రైటర్ కూన పెద్దిరాజు ద్వారా తప్పుడు పత్రాలను సృష్టించినట్లు నిర్ధారణైందన్నారు. సరిపల్లి లక్ష్మణరావు.. దాదాపు 70 డాక్యుమెంట్లకు సాక్షి సంతకాలు పెట్టినట్లు తెలిసిందన్నారు. వీటన్నింటికీ అప్పుడు ఆమదాలవలసలో పనిచేస్తున్న ప్రస్తుత హిరమండలం సబ్ రిజిస్ట్రార్ (ఏ13) బొడ్డేపల్లి అరుణ వంతపాడారని రుజువైందన్నారు. తమ్మినేని సీతారాం (ఏ6), తమ్మినేని వాణి (ఏ7), తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్ (నాని)(ఏ5), బొడ్డేపల్లి అరుణ (ఏ13), త్రినాథ్(ఏ4)లను అదుపులోకి తీసుకోవాల్సి వుందని తెలిపారు. భూ కబ్జా వ్యవహారం గుట్టు రట్టు చేసిన పోలీసులను ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు. భూములు కొనుగోలు చేసేటపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భూ రికార్డులు, యాజమాన్య, వారసత్వ పత్రాలను, రిజిస్ట్రేషన్ వివరాలను ప్రభుత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలన్నారు. రూ.5 లక్షలకు మించిన భూ లావాదేవీలను పాన్ కార్డు వివరాలతోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి, నకిలీ పత్రాలతో భూ ఆక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



### నలుగురు ఎస్ఐలకు బదిలీ

జిల్లాలో నలుగురు ఎస్ఐలకు బదిలీ చేస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. లావేరు ఎస్ఐ అప్పల సూరిని జి.సిగడాంకు, జి.సిగడాం ఎస్ఐ సందీప్‌ను లావేరుకు, పొందూరు ఎస్ఐ సత్యనారాయణను జేఆర్ పురం, సీసీఎస్ ఎస్ఐ రాజేష్‌ను పొందూరుకు బదిలీ చేశారు. జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవిని వీఆర్‌కు పంపించారు. కాశీబుగ్గ ఎస్ఐ సునీల్‌కు రెండు రోజుల కిందటే వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే.



### అవాస్తవాలతో పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీయొద్దు..

మందస మండలం పితాతోలి జంక్షన్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంపై సామాజిక మాధ్యమాలు, కొన్ని పత్రికల్లో వస్తున్న వదంతులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఖండించారు. ఆ కేసు వివరాలను సైతం ఎస్పీ మీడియాకు వివరించారు. ఈనెల 13న పెద్దలోహరిబందకు చెందిన మురపాల తులసమ్మ(43), తన అక్క కుమారుడు నర్తు వెంకటరమణతో కలిసి ద్విచక్ర వాహనంపై మందస వెళ్లి తిరిగి వస్తుండగా మధ్యాహ్నం 1.45 గంటలకు మందస- హరిపురం బీటీ రోడ్డులో పితాతోలి బస్టాండ్ వద్ద ఎదురుగా వచ్చిన ఎరుపు రంగు లగేజీ ఆటో డ్రైవర్ వీరి వాహనాన్ని ఢీకొట్టాడన్నారు. దీంతో బైక్‌పై ఉన్న తులసమ్మ, వెంకటరమణలకు గాయాలయ్యాయన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ గుడ్డిభద్ర సునీల్.. క్షతగాత్రులను తన ఆటోలోనే హరిపురం సీహెచ్‌సీకి తరలించాడని, అక్కడి నుంచి వెంకటరమణను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం మెడికవర్‌కు తరలించారని చెప్పారు. ఈ ఘటనపై 13 తేదీ సాయంత్రం 4 గంటలకు ముందస పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. మెడికవర్‌లో చికిత్స పొందుతున్న వెంకటరమణను 14న విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య నర్తు రోజా ఫిర్యాదు మేరకు పోలీసులు ఈనెల 15న కేసులో బీఎన్ఎస్ సెక్షన్ 106(1)ను చేర్చి కేసును ఆల్టర్ చేశారన్నారు. మందస పోలీసులు ప్రత్యక్షసాక్షుల వాంగ్మూలాలతో పాటు సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటాను విశ్లేషించారని ఎస్పీ తెలిపారు. కొందరు పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తూ, వాస్తవాలు వక్రీకరించి ప్రచారంచేయడం తగదన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజలను తప్పుదోవ పట్టించినట్లు అవుతుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని విశ్వసించాలని ఎస్పీ సూచించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పూడుకుపోయిన సాగునీటి కాలువలు

**- మురుగునీటిని తలపిస్తున్న వంశధార అనుబంధ కాలువ**

**- ఖరీఫ్‌కు ముందే పూడికతీత చేపట్టాలని రైతుల విజ్ఞప్తి**



**నరసన్నపేట, జులై 19 (వార్త):** నరసన్నపేట పట్టణ పరిధిలోని సాగునీటి కాలువలు నిర్వహణ లోపంతో మురుగునీటి కాలువలను తలపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశవానిపేట వద్ద వంశధార ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న కాలువ పూడిక, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి సమయం ఆసన్నమైన నేపథ్యంలో సాగునీటి పంపిణీపై ప్రభావం పడకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించకపోతే నీటి సరఫరా సక్రమంగా జరగక పంటల సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది సాగునీటి విడుదలకు ముందే కాలువల పూడికతీత, శుభ్రపరిచే పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఈసారి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోతోందని, భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవిస్తున్న రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే కాలువలను పరిశీలించి పూడికతీత, శుభ్రపరిచే పనులు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ పంటల సాగు ప్రారంభానికి ముందే కాలువలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని కోరుతున్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- కర్ని రమణ**



**పలాస, జులై 19 (వార్త):** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పేర్కొన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు వజ్రపుకొత్తూరు మండలం, గోవిందపురం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ ఆదివారం ప్రారంభించి రైతులకు యూరియాను అందజేశారు. ఈ సందర్భంగా కర్ని రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి పాలనలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారని, రైతులకు అవసరమైన సమయంలో విత్తనాలు, ఎరువులు, సాగునీరు అందేలా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక చొరవతో నియోజవర్గం రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో యూరియా అందించడం జరిగిందని తెలిపారు. ఈ యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రతి రైతు ఆధార్‌ను ధృవీకరించిన అనంతరమే యూరియా పంపిణీ చేస్తున్నామని కర్ని రమణ వెల్లడించారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అవసరమైన సమయంలో సాగునీరు, విత్తనాలు, ఎరువులు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు. రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు సంతోషమే రాష్ట్ర అభివృద్ధికి బాట అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జోగారావు, చంద్రయ్య, మోహనరావు, నాగు, కామేష్, సత్యం, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, సహకార సంఘం (సొసైటీ) సభ్యులు, మండల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దానయ్య కుటుంబానికి అండగా దాతలు

**- కూరగాయలు, చిన్నారులకు నూతన దుస్తులు అందజేత**



**పలాస, జులై 19 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన దుబ్బ దానయ్య కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో మరోసారి పరామర్శించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా దృక్పథంతో కొరికాన శంకరరావు బాధిత కుటుంబానికి కూరగాయలు, రెండు నెలలకి సరిపడ నిత్యావసర వస్తువులు అందజేయడంతో పాటు చిన్నారులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ క్లిష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. బాధలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. దుబ్బ దానయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ సహకారం, మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యాదవ సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాల ఎన్‌పీసీఐ సీడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జూలై 22వ తేదీన ఆర్థిక సహాయాన్ని విడుదల చేయనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె. వినాయకం తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థుల్లో బ్యాంకు ఖాతా లేదా ఎన్‌పీసీఐ సీడింగ్ పెండింగ్‌లో ఉన్నవారు వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. బ్యాంకు ఖాతా లేని విద్యార్థుల కోసం ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా కేవలం రూ.200/-లతో ఖాతా ప్రారంభించుకునే ప్రత్యేక అవకాశం కల్పించామని, మైనర్ విద్యార్థులైతే తల్లిదండ్రుల ఆధార్, బయోమెట్రిక్ ద్వారా ఈ కేవైసీ పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ఖాతా తెరిచేందుకు ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల మెమో లేదా జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరమవుతాయని వివరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ పరిధిలోని అర్హులైన ఎస్సీ విద్యార్థులను గుర్తించి, అవసరమైన పత్రాల జిరాక్స్ కాపీలతో సమీపంలోని ఐపీపీబీ ప్రత్యేక శిబిరాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూలై 22న నిధులు విడుదల కానున్నందున, పెండింగ్ బ్యాంకు ఖాతాలు మరియు ఎన్‌పీసీఐ ప్రక్రియను అత్యవసరంగా 100 శాతం పూర్తి చేయాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

## ఇజ్రాయెల్‌లో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** ఇజ్రాయెల్‌లో ఒప్పంద ప్రాతిపదికన నర్సింగ్ సెక్టార్-6ఏలో పనిచేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు (ఈడీ) కె.వినాయకం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, 25 నుంచి 45 ఏళ్ల లోపు వయసున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,99,700 చొప్పున వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ (సాఫ్ట్ స్కిల్స్), నర్సింగ్ స్కిల్స్‌తో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం శ్రీకాకుళంలోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో లేదా మొబైల్ నంబరు 9704895271 లో సంప్రదించాలని ఈడీ కోరారు.

## ఆగస్టు 1.. భోగాపురం ముహూర్తం ఫిక్స్..!

**- ప్రధాని మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభోత్సవం**

**- ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర అయ్యేందుకు ముహూర్తం ఆసన్నమైందన్న రామ్మోహన్ నాయుడు**

**- గొప్ప వేడుక విజయవంతం అయ్యేలా రాష్ట్ర ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరిన కేంద్రమంత్రి**



**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మాణ దశను పూర్తి చేసుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభోత్సవం జరగనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఆగస్టు ఒకటవ తేదీ.. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్రగా నిలిచేందుకు ముహూర్తం ఆసన్నమైందని రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు.. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఓ గొప్ప క్షణం ఆవిష్కృతం అవుతున్న నేపథ్యంలో.. ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా తమ మద్దతును ఈ వేడుకకు అందివ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ప్రధాని పర్యటన తాలుక పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని స్పష్టం చేశారు.



## తలసేమియా బాధితులను ఆదుకోవాలి

**- జిల్లా పౌర సరఫరాల అధికారి గుంట సూర్య ప్రకాష్‌రావు**

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** తలసేమియా బాధితులకు రక్తాన్ని అందించి ఆదర్శంగా నిలవాలని, జిల్లాలోని డీలర్ల సహకారంతో మూడు డివిజన్లలోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని జిల్లా పౌర సరఫరా అధికారి గుంట సూర్య ప్రకాష్ రావు పేర్కొన్నారు. శ్రీ

కాకుళం జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో జిల్లా పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో, చౌక ధరల డిపోల యూనియన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు, చౌక ధరల డిపోల జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ బి. భాస్కరరావులతో కలిసి ఆయన రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. రక్తం కొరత అధికంగా ఉన్న ప్రస్తుత సమయంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ల సహకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమని రెడ్ క్రాస్ చైర్మన్ కొనియాడారు. డీలర్ల సహకారంతో సమాజంలో రక్తదానంపై విస్తృత ప్రేరణ కల్పించి, బాధితులకు సకాలంలో రక్తం అందించడం ద్వారా ప్రాణాపాయాన్ని తప్పించవచ్చని యూనియన్ ప్రెసిడెంట్ భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో పౌర సరఫరా శాఖ అధికారులు, చౌక ధరల డిపోల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి. రవికుమార్, శ్రీకాకుళం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ చిన్ని నాయుడు, ఎస్. సి. ఆర్. నాయుడు, రవికుమార్, ఎచ్చెర్ల మండల కోశాధికారి సి. హెచ్. అప్పారావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కె. సత్యనారాయణ, పి. చైతన్య కుమార్ లతో పాటు పెద్ద సంఖ్యలో రేషన్ డీలర్లు పాల్గొని రక్తదానం చేశారు.

## సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు అప్రజాస్వామికం

**- కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి**

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో పాటు ఇతర జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయ, విద్యార్థి, దళిత, ఆదివాసీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం శ్రీకాకుళం పట్టణంలోని కాలేజీ రోడ్డు జంక్షన్ వద్ద గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ శాంతియుత నిరసనను అణచివేయడం రాజ్యాంగ విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్‌ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, నీట్ సహా అన్ని జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, పై డిమాండ్ల సాధన కోసం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జూలై 20న నిర్వహించనున్న "చలో పార్లమెంట్" కార్యక్రమానికి ఐక్యవేదిక తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పేడాడ కృష్ణారావు, కో-కన్వీనర్ దుర్గాసి గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వి. జగన్నాధరావు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బడే కామరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు కానుకుర్తి గోవింద, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రాకోటి రాంబాబు, రెల్లి కుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ ఆర్.జి. కోటి, జలుమూరు కొండలరావు, తిరుపతిరావు, అనంతరావు, వదినగిరి, ఎడ్ల జానకిరావు, విదసం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల గోపి, జన సాహితి, జిల్లా బాధ్యులు పి. మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



## వైటీసీలో 'ఐఐటీ సూపర్ 60' ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సీతంపేట ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీకాకుళం వై.టి.సి (యూత్ ట్రైనింగ్ సెంటర్) లో "ఐ.ఐ.టి సూపర్ 60" బ్యాచ్‌కు గాను, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టులను పార్ట్ టైం ప్రాతిపదికన బోధించడానికి అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ సీతంపేట పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో ప్రస్తుతం గణితం, భౌతిక శాస్త్ర సబ్జెక్టులను బోధిస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, బోధనా అనుభవం, సబ్జెక్ట్ నైపుణ్యం ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ నెల 25వ తేదీ లోగా సీతంపేట వై.టి.సి కార్యాలయంలోని గురుకులం సెల్‌లో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28వ తేదీన ఉదయం 10.30 గంటలకు సీతంపేట ఐటిడిఏ లో ఇంటర్వ్యూ డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల గిరిజన సంక్షేమ శాఖ రెగ్యులర్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

## ధ్యానంతో ఆరోగ్యం

**- నరసన్నపేటలో స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ**

**- ధ్యానం దివ్య ఔషధంలా పనిచేస్తుందని సందేశం**



**నరసన్నపేట, జులై 19 (వార్త):** ధ్యానం మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని, శాఖాహార జీవన విధానం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని శ్రీకాకుళం స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం నరసన్నపేట మండల కేంద్రంలో శ్రీకాకుళం స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో పిరమిడ్ ధ్యాన ప్రతినిధులు, ధ్యాన సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ధ్యానం సర్వరోగ నివారిణి -- సత్యజ్ఞాన ప్రసాదిని -- సకల భోగకారిణి" అంటూ నినాదాలు చేశారు. ధ్యానం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత పెరుగుతుందని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఇది దోహదపడుతుందని వివరించారు. అలాగే శాఖాహారమే ఆరోగ్యానికి మేలని, సాత్విక ఆహారం శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ధ్యానాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని తెలిపారు. ఈ ర్యాలీలో పిరమిడ్ ప్రతినిధులు, ధ్యాన సాధకులు, మహిళలు, యువతతో పాటు వందలాది మంది పాల్గొని ధ్యానం, ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## బమ్మిడి కామేశ్వరావు కుటుంబానికి బాబా పరామర్శ

**పలాస, జులై 19 (వార్త):** పలాస మండలం లక్ష్మీపురం గ్రామ మాజీ సర్పంచ బమ్మిడి కామేశ్వరరావు ఇటీవల శివైక్యం చెందారు. ఈ వార్త తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కామేశ్వరరావు సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించారు. అందరితో కలివిడిగా ఉండే స్వభావం, సామాజిక సేవా తత్పరతతో ఆయనకు గ్రామంలో మంచి పేరుంది. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, దువ్వాడ శ్రీధర్ (బాబు) కుటుంబ సభ్యులు బమ్మిడి బాలా, దువ్వాడ శ్రీహర్ష నివాసానికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కామేశ్వరావు మరణం గ్రామానికి తీరని లోటని, ఆయన చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాం నరేష్ జినగ, సుబ్బారెడ్డి, అనీల్ ఉంగ తదితరులు పాల్గొని కుటుంబానికి అండగా నిలిచారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# గందరగోళం..రసాభాస..!

## - జిల్లా శ్రీశయన సంఘం కార్యవర్గ ఎన్నికల్లో ఎవరికివారుగా అధ్యక్షుల ఎన్నిక



**సోంపేట, జులై 19 (వార్త):** జిల్లా శ్రీశయన సంఘం ( 74 గ్రామాలతో కూడిన) కార్యవర్గ ఎన్నికలు గందరగోళంగా రసాభాసగా మారాయి. చివరకు రెండు వర్గాల మధ్య ఎవరికివారుగా అధ్యక్షులను ఎన్నుకున్న విచిత్రమైన పరిస్థితులు సోంపేటలో ఆదివారం చోటు చేసుకున్నాయి. మాజీ అధ్యక్షుడు లోట్ల దీనభంధు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల తంతు అట్టర్ ఫ్లాప్‌గా మారింది. నిర్వాహకుల అసమర్థత కొట్టొచ్చినట్టుగా కనిపించింది. వివరాల్లోకి వెళితే జిల్లా శ్రీశయన సంఘ అధ్యక్షుని పదవికి ఏడుగురు సభ్యులు నామినేషన్ వేశారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరగాలని అందరూ పట్టుబట్టారు. చివరకు ఎన్నికలను పాత కార్యవర్గమే నిర్వహిస్తుందని కండిషన్ పెట్టి పోటీదారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చివరికి అధ్యక్ష పదవి కోసం ఇద్దరు అభ్యర్థులు దేవాడ మోహనరావు, బింగి తాతయ్య గట్టిగా పట్టుబట్టారు. కమిటీ వారు ఇద్దరినీ రాజీపర్చలేకపోయారు. ఈ సందర్భంలో 74 గ్రామాల నుంచి వచ్చిన ప్రతినిధుల సలహా సూచనలు కూడా కనీసం తీసుకోకుండా తమ పంతం నెగ్గించుకునే ప్రయత్నంలో తమ అనుకూలమైన వ్యక్తి బింగి తాతయ్య పేరును అధ్యక్షునిగా ప్రకటించడంతో సమావేశంలో ఒక్కసారి గందరగోళం నెలకొంది. అనేక గ్రామాల ప్రతినిధులను పిలిచి కమిటీ తమ ఇష్టానుసారంగా ఏకపక్షంగా అధ్యక్షుని పేరు ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఏకపక్షంగా ఎవరి సూచనలు, సలహాలు లేకుండా పాత కమిటీ నిర్ణయాన్ని అందరు తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యను ఏ ఒక్కరూ అంగీకరించలేదు. దీనిపై అనేక గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తాతయ్య వర్గంపై ఆగ్రహంతో ఊగిపోయారు. సమావేశం, ఎన్నికల నిర్వహణ రసాభాసగా మారింది. ఏకపక్షంగా ప్రకటించిన తాతయ్య పేరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించమని వ్యతిరేకవర్గం గట్టిగా పట్టుబట్టింది. ఈ సందర్భంలో పరిస్థితి గందరగోళమై వచ్చిన ప్రజలంతా చెల్లాచెదురయ్యారు. తాతయ్య ప్రమాణస్వీకారాన్ని వ్యతిరేక వర్గం పూర్తిగా అడ్డుకుంటూ తిరస్కరించింది. తాతయ్య డౌన్ డౌన్ అంటూ దీనబందు డౌన్ డౌన్ అంటూ నిరసనతో సమావేశ ప్రాంగణం హోరెత్తింది. నిరసనలతో తాతయ్యతో పాటు ఆయన వర్గీయులు సమావేశం నుంచి బయటికి వెళ్లిపోవడంతో దేవాడ మోహన్రావు వర్గీయులంతా మోహన్రావును వేదికపై కూర్చుండబెట్టి జిల్లా సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రకటించుకున్నారు. ఆయనకు దుస్సాలువతో సన్మానించారు. ఇలా అస్తవ్యస్తంగా పోటీ సంఘాలుగా ఏర్పడి ఇరువురు అధ్యక్షులను ఎవరికి వారుగా ఎంపిక చేసుకోవడం జిల్లా శ్రీశయన చరిత్రలో చీకటి అధ్యాయంగా పలువురు బహిరంగంగా పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో లోపాలు పూర్తిగా బట్టబయలు అయ్యాయి. నిర్వాహకుల తీరును ప్రతి ఒక్కరూ విమర్శిస్తున్నారు. మోహన్ రావు ఆధ్వర్యంలో త్వరలో కొత్త కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఏర్పాటు చేస్తామని ఆ వర్గీయులు పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నటువంటి ఈ ఎన్నికలు ఒక తీరని మచ్చగా మిగిలిపోతాయని ప్రతి ఒక్కరూ పేర్కొనడం గమనార్హం. ఏకగ్రీవం కానప్పుడు ఓటింగ్ ఎందుకు నిర్వహించలేదని ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారు.

## మన ఊరు - మన జెండా స్థల పరిశీలనలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం



**కొత్తూరు, జులై 19 (వార్త):** మన ఊరు – మన జెండా కార్యక్రమం లో భాగంగా కొత్తూరు మండలం బలద పంచాయతీ మెయిన్ రోడ్ లో స్థల పరిశీలన మండల బీజేపీ నాయకులతో కలిసి జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు జరిపారు. మండల అధ్యక్షులకు, మండల బీజేపీ నాయకులకు మొదట విడతగా అన్ని పంచాయతీలలో స్థల పరిశీలన చెయ్యాలని నాయకులతో మాట్లాడారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు బురడా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కాపలా దమయంతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చోడవరపు నరసింహమూర్తి, మండల ప్రధానకార్యదర్శులు చల్లా ఈశ్వరరావు, ఇల్లం నాయుడు, భాస్కరరావు,సాన లక్ష్మీనారాయణ,బలద కృష్ణ, పొగిరి గోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదిత్యుడి ఆదాయం రూ.6.50లక్షలు

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దర్శనానికి ఆదివారం విచ్చేసిన భక్తుల ద్వారా టికెట్లు రూపేనా రూ.2,98,900లు, స్వామి వారి పూజలు, విరాళాల రూపంలో రూ.45,156లు, ప్రసాదాల రూపంలో రూ.1,23,655లు (దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు, ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ మన మిత్ర ఆన్‌లైన్ టిక్కెట్లు ద్వారా మొత్తం రూపంలో రూ.1,82,383 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ



**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా త్వరలో జరగబోయే కానిస్టేబుల్ ఎంపిక పరీక్షకు శిక్షణా కార్యక్రమం.. ఆదివారం నాడు ప్రారంభం అయింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపక బృందం 120 రోజుల శిక్షణకు సంబంధించి తరగతులు జరిగే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. నగరంలోని స్టేడియం వద్ద గల ప్రజా సదన్ కార్యాలయంలో 120 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా.. కొద్ది రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి.. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి దైనందిన తరగతులు, మాక్ టెస్టులు, రోజువారి పురోగతి, ఇలా పలు అంశాల్లో ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు 11సబ్జెకులకు సంబంధించి విలువైన మెటీరియల్ అందించనున్నారు. శిక్షణ లో భాగంగా నిపుణులైన అధ్యాపకులతో బోధనా తరగతులు సైతం నిర్వహిస్తారు. కానిస్టేబుల్ పరీక్ష కావడంతో ఈసారి ప్రత్యేకంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ ను కూడా శిక్షణలో భాగస్వామ్యం చేశారు. ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఆర్.ఆర్.బి గ్రూప్ డి, గ్రూప్ బి, డీఎస్సీ, నవోదయ, ఇతర ప్రవేశ పరీక్షలకు అభ్యర్థులకు శిక్షణను చేరువ చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. ఈసారి కానిస్టేబుల్ పరీక్షకు సన్నద్ధం అయ్యే అభ్యర్థుల కోసం కూడా ఇదే తరహా శైలిని అవలంభిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష లో మొత్తంగా 606 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా.. అందులో 60 మందిని ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. బయట ఇదే తరహా శిక్షణకు అధిక వ్యయం అవుతున్న నేపథ్యంలో.. శిక్షణకు ఎంపిక అయిన విద్యార్థులు.. ఉచితంగా తమకు ఈ విలువైన తరగతులు చేరువ అవ్వడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తోడ్పాటు కు ధన్యవాదాలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, టి.ఎన్.ఎస్. ఎఫ్ ప్రతినిధులు, ఎర్రన్న విద్యా సంకల్పం నిర్వాహకులు పాల్గొన్నారు.

## మార్కెట్ పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



**సోంపేట, జులై 19 (వార్త):** సోంపేట మేజర్ పంచాయతీలో మార్కెట్ పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. చిన్నపాటి వర్షానికి బురదమయమై ఈగలు దోమలు రాజ్యమేలుతున్నాయి. దుర్గంధం కూడా విపరీతమై ప్రజలు అలాగే అమ్మకం దారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితిని చక్కదిద్దాల్సిన పంచాయతీ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్కు నిత్యం వచ్చే వందలాదిమంది వినియోగదారులు కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. పారిశుధ్యన్ని పట్టించుకోవాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంతో మరింత అధ్వానంగా మార్కెట్ మారిపోతుంది. ఇప్పటికైనా పరిస్థితులు చక్కదిద్దాలని ప్రజలంతా కోరుతున్నారు.

## మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో దండుగోపాలపురంలో బోరుకు శంకుస్థాపన



**సంతబొమ్మాళి, జూలై 19 (వార్త):** సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో పెద్దచెరువు సమీపంలో కొత్త బోరు తవ్వకాలకు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. వేసవికాలంలో గ్రామ ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన బోరు మంజూరుకు ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ బోరు ఏర్పాటు ద్వారా గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రైతులు, యువత ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు, యువత మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి బోరు మంజూరు చేసిన మంత్రి అచ్చెన్నాయుడికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి మంత్రి నిరంతరం సహకరిస్తున్నారని కొనియాడారు. శంకుస్థాపన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, సంతబొమ్మాళి మండల ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్ కుమార్‌తో పాటు గ్రామ పెద్దలు, రైతులు, యువత, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో ఎస్సీ కేటగిరీ సీట్ల భర్తీ

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో ఎస్సీ (రాజ) కేటగిరీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆసక్తి గల విద్యార్థులు/విద్యార్థినులు సంబంధిత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమన్వయ అధికారి వై. యశోదా లక్ష్మి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీ సీట్ల వివరాలను పరిశీలిస్తే 5వ తరగతిలిలో: దుప్పలవలస, కొల్లివలస, కంచిలి, పెద్దపాడు, నందిగాం, కొల్లివలస, మందస, పాతపట్నం గురుకుల పాఠశాలలు, ల6, 7వ తరగతిలో: కంచిలి, నందిగాం, మందస, పాతపట్నం గురుకుల పాఠశాలలో ఖాళీలు ఉన్నట్లు ఆ ప్రకటనలో వివరించారు. ఇంటర్మీడియట్‌లో కంచిలి, నందిగాం గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ఎస్సీ కేటగిరీ విద్యార్థులు వెంటనే సంబంధిత గురుకుల పాఠశాలలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు 9701736862 ఒ 9441468091 నంబర్లను సంప్రదించగలరు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** రక్తదానం చేయడం అంటే ఒకరి ప్రాణాలను కాపాడేందుకు చేయూతనివ్వడమేనని, అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం పేర్కొన్నారు. నగరంలోని ఎన్జీవో సంఘ కార్యాలయంలో ఆదివారం జీవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఏజెసి చైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు, ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు ప్రారంభించారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హనుమంతు సాయిరాం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రక్త కొరత అధికంగా ఉన్నందున ఈ రక్తదాన శిబిరం నిర్వహణకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు, తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని తెలిపారు. ఆరోగ్యవంతమైన ప్రతి వ్యక్తి నిర్దిష్ట వ్యవధిలో స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, వైద్యుల పర్యవేక్షణలో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలతో రక్త సేకరణ జరుగుతుందని వివరించారు. ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఏ జె సి చైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, అవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడే ఈ మహోన్నత సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్లే అవుతుందన్నారు. సమాజానికి సేవ వల్ల సంతృప్తి, మానసిక ఆనందం కలుగుతుందని చెప్పారు. శిబిరంలో రక్తదానం చేసిన దాతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ రక్తధన శివరంలో ఎన్జీవో సంఘ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, ఎం ఆర్ కే దాసు, నాళ్ల ఆదినారాయణ, సురేష్, సంతోష్, ఉపాధ్యాయ సంఘ నాయకులు బి భాస్కరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు చౌదరి సతీష్, రౌతు సూర్యనారాయణ, రిమ్స్ వైద్యులు ఎం షామిలి, పి ప్రకాష్ రావు, హౌస్ సర్జన్లు దివ్యశ్రీ, ఇనోబా సింగ్, స్టాఫ్ నర్సులు శరత్, శ్రీదేవి, ఐని ల్యాబ్ అటెండర్ ముకుందరావు, కౌన్సిలర్ తాతారావు ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణవేణి, శ్యామ్, విష్ణు, బిసి టీవీ సిబ్బంది విజయ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 130 మంది రక్తదానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.






## 50 ఏళ్లు .. 55 సేవా కార్యక్రమాలు

### - పలాస లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### - నూతన అధ్యక్షుడిగా కోదండరామయ్య

**పలాస, జులై 19 (వార్త):** 50 సంవత్సరాలు 55 సేవా కార్యక్రమాలు చేస్తామని, పలాస కాశీ బుగ్గ లైన్స్ క్లబ్ సేవలు ప్రపంచ దేశాల్లో విస్తృతం చేస్తామని నూతన అధ్యక్షులు నంబాళ్ల కోదండరామయ్య పేర్కొన్నారు. ఆదివారం పలాస లైన్స్ క్లబ్ కార్యాలయంలో నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా అనుకున్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత నేత మాజీ ఎంపీ లైన్స్ క్లబ్ ప్రదాత డాక్టర్ కనితి విశ్వనాదం విగ్రహానికి పూలమాలలు వేసిన వాళ్ళు అర్పించారు. పలాస లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా, ఆత్మీయ వాతావరణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస కాశీ బుగ్గ లైన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతామని అన్నారు. ఎంతో బాధ్యతగా నాపై నమ్మకం ఉంచి నన్ను ఈ బాధ్యతలు అప్పగించినందుకు నాపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నా బాధ్యతలు నేను నిర్వర్తిస్తూ నా పదవి బాధ్యతలకు న్యాయం చేస్తానని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ జిల్లా మెదటి గవర్నర్ ఎన్ శ్రీనివాసరావు, హాజరైన పీఎంజేఎఫ్ జిల్లా వైస్ గవర్నర్ ఇన్స్టాలేషన్ ఆఫీసర్ గా కెవి రావు ప్రమాణ స్వీకారం చేయిస్తూ క్లబ్ నూతన అధ్యక్షుడుగా కోదండ రామయ్య కోదండరామయ్య, కార్యదర్శిగా తమ్మినేని మాధవరావు , కోశాధికారిగా ఐ అప్పారావు, ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ లైన్స్ క్లబ్‌లు సాధారణంగా సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యత, ఆరోగ్య శిబిరాలు, అవసరార్థుల సహాయ కార్యక్రమం చేపడతామని అన్నారు. క్లబ్ సేవా ధ్యేయాన్ని కొనసాగిస్తూ సమాజ హిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. లైన్స్ క్లబ్ అంతర్జాతీయ నిబంధనలు, సేవా స్ఫూర్తి, క్రమశిక్షణతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్య అవగాహన, రక్తదాన శిబిరాలు, నేత్ర పరీక్షలు, పేదలకు సహాయం, యువత అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూర్వ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కొత్త బృందానికి అందరూ శుభాకాంక్షలు తెలిపారు. పలాసలో లైన్స్ క్లబ్ కార్యక్రమాలు స్థానిక సేవా కార్యకలాపాలకు బలమైన వేదికగా కొనసాగుతున్నాయని అన్నారు. లైన్స్ క్లబ్‌లు సేవా కార్యక్రమాలకు ప్రసిద్ధి అని పేర్కొంటూ, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, నేత్ర పరీక్షలు, అవసరార్థులకు సహాయం, విద్యా ప్రోత్సాహం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పలాస లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమమాన్ని ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పూర్వాధికారులు, సభ్యులు, ఆహ్వానితులు, స్థానిక ప్రముఖులు హాజరయ్యారు. ఈ ల ఈ కార్యక్రమంలో నున్నపు శ్రీనివాసరావు, తమ్మినాన మాధవరావు, యన్ అప్పరావు, కె.వి రావు, పైల జవహర్ పాల్గొన్నారు.

## షైనింగ్‌స్టార్‌లకు నేడు అవార్డుల ప్రదానం

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు 20 వేల రూపాయలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం ఇచ్చి సన్మానంచుట జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఎంపిక కాబడిన విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు సోమవారం ఉదయం 8 గంటలకు ఆనందమయి కన్వెన్షన్ హాల్, 80ఫీట్ రోడ్డు, శ్రీకాకుళం నందు జరగబోయే సైనింగ్ స్టార్లు 2026 కార్యక్రమ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రాజకీయ ప్రముఖులు కూడా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. కావున సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంపికైన విద్యార్థినీ , విద్యార్థులు సకాలంలో సమావేశానికి హాజరగు విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సోనం అక్రమ తరలింపు సరికాదు

**పలాస, జులై 19 (వార్త):** సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ అక్రమ తరలింపును నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వామపక్ష నేతలు రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థులు, యువజనుల న్యాయబద్ధమైన డిమాండ్స్ ని వెంటనే పరిష్కరించాలని గత కొద్ది రోజుల నుండి జంతర్ మంతర్ దగ్గర జరుగుతున్న విద్యార్థుల ఉద్యమానికి పూర్తిస్థాయి మద్దతు ప్రకటించలని ప్రజా ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో పిలుపునిచ్చారు. (పౌర హక్కుల సంఘం ప్రగతిశీల కార్మిక సమైక్య దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం డేమాక్రిటిక్ టీచర్స్ ఫెడరేషన్ కుల నిర్మూలన పోరాట సమితి అమరుల బంధుమిత్రుల సంఘం), ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకత్వంలో ఆదివారం బొడ్డపాడులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి. దానేష్ అధ్యక్షత వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో నేడు జరుగుతున్న విద్యార్థి యువజన ఉద్యమానికి దేశ ప్రజల మద్దతు కావాలని వాళ్ళ డిమాండ్స్ ని పరిష్కరించాలని పిలుపునిచ్చారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు కోత. ధర్మారావు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుండి రాజధానిలో జరుగుతున్న విద్యార్థుల యువకుల ఉద్యమానికి మద్దతుగా సోనం వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్షను కేంద్ర ప్రభుత్వం భగ్నం చేయటం, ఆ ప్రజాస్వామిక చర్యని, న్యాయబద్ధమైన డిమాండ్స్ ని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించకుండా అర్థాంతరంగా దీక్షను భగ్నం చేయటంపై తీవ్రమైన అభ్యంతరాన్ని తెలియజేశారు. నీట్ పేపరు లీకేజీపై దాని బాధ్యులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాలు ఇలాంటి అక్రమ నిర్బంధ చర్యలకు పాల్పడం నిరంకుశ విధానాలని అభిప్రాయపడ్డారు. న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, పి డి ఎస్ యు ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ లు మాట్లాడుతూ జంతర్ మంతర్ లో జరుగుతున్న పోరాటానికి మద్దతు సంఘీభావాన్ని తెలుపుతూ వెంటనే కేంద్ర ప్రభుత్వం వాళ్ల న్యాయమైన డిమాండ్స్ ని పరిష్కరించాలని, నిరసనకు కారణమైన అజెండాలను పరిష్కరించకుండా అక్రమంగా నిరసనకారులను తరలించడంపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. పాలకుల విధానాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు అక్రమ నిర్బంధాలు చేయటం సరికాదని, దేశంలో పటిష్టమైన విద్య పరీక్షలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులైన దుర్యోధన మాస్టారు కరుణాకర్ మాస్టారులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ఆత్మహత్యలను వాటికి కారణమైన విద్యాశాఖ మంత్రులను వెంటనే బాధ్యత నుంచి తప్పించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. విద్య నేడు మార్కెట్లో సరుకుగా మార్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సూచన చేశారు. ఆ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు యువకులకు దేశ ప్రజలు మద్దతు ఇవ్వాలని వాళ్ళ డిమాండ్స్ ను పరిష్కరించే వరకు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.

ప్రగతిశీల కార్మిక సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి పుచ్చ దుర్యోధన దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు సాలిన వీరాస్వామి లక్ష్మణ కుల నిర్మూలన పోరాట సమితి ప్రభాకర్ అమరుల బంధుమిత్రుల సంఘం నాయకుల కోదండరాం మాట్లాడుతూ దేశంలో ప్రభావితం చేసిన జంతర్ మంతర్ ఉద్యమానికి అందులో పాల్గొని ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న సోనం అక్రమ తరలింపుపై తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దేశ పురోగతికి జ్ఞానానికి సంబంధించిన విద్యను నిర్లక్ష్యం చేయటం సబబు కాదని, విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వారిని కేంద్ర ప్రభుత్వ శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘాల నాయకులు ప్రజాస్వానుకవాదులు వామపక్ష పార్టీ నాయకులు మన్మధరావు అజయ్ కుమార్ లు మాట్లాడుతూ ప్రశ్నించే వారి సమస్యలను పరిష్కరించకుండా అక్రమంగా అరెస్టులు చేయటం విధ్వంసం చేయడం సరైనది కాదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పౌర హక్కుల సంఘం నాయకులు సోమనాదం వైకుంఠరావు, జోగారావు మాస్టారు, దానయ్య లక్ష్మను, లిబరేషన్ పార్టీ నాయకులు కుతం దుష్యంతు, గేదెల జగదీష్ తదితరులు పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేశారు.



## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక



**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నేడు (సోమవారం ) నిర్వహించ బడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నేరుగా పై కార్యక్రమములో లేదా ఆన్లైన్ లో Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శివరాంపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**సారవకోట, జులై 19 (వార్త):** శివరాంపురం గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు వేగవంతమయ్యాయి. మండల పరిషత్ నిధుల నుంచి రూ. 4.90 లక్షలు కేటాయించి గ్రామంలో రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న రోడ్ల సమస్యలు, మురుగునీటి పారుదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారులు మెరుగుపడటంతో పాటు మురుగునీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా కాలువల నిర్మాణం ఉపయోగపడుతుందని, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. నిర్ణయించిన గడువులోగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## అసంపూర్తిగా పశువైద్య కేంద్రం నిర్మాణం



**నరసన్నపేట, జులై 19 (వార్త):** చోడవరంలో నిర్మాణంలో ఉన్న పశువైద్య కేంద్రం భవనం దశాబ్ద కాలంగా అర్థాంతరంగా నిలిచిపోవడంతో పాడి రైతులు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో భవనం చుట్టూ ముళ్ల పొదలు పెరిగి శిథిలావస్థను తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్య కేంద్రానికి సొంత భవనం అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం పాత గ్రామ పంచాయతీ భవనంలోనే వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. తగిన వసతులు లేకపోవడం వల్ల వైద్య సేవల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. పశుసంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు సమయానికి వైద్య సేవలు అందడం ఎంతో అవసరమని, అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిర్మాణం పూర్తయితే పశువులకు మెరుగైన వైద్య సేవలు అందడంతో పాటు రైతులకు కూడా సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై మండల పశువైద్యాధికారి ఓంకార్‌ను సంప్రదించగా, అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణ అంశాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరైన వెంటనే తదుపరి చర్యలు చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. పశువైద్య కేంద్రం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అర్హుల ఓటు తొలగించొద్దు

**జలుమూరు, జులై 19 (వార్త):** జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాల ప్రత్యేక సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియపై అధికారులు నిర్వహించిన సమీక్ష సమావేశంలో నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఓటరు జాబితాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగింపునకు గురికాకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు, ఓటరు జాబితాల్లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా డిజిటలైజేషన్ ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కావడంతో పాటు, జాబితాల్లోని లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మామిడి సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భేరి వెంకటరమణతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# యాప్ మొరాయింపు.. రైతుల నిరీక్షణ

- జోనంకి రైతు సేవా కేంద్రంలో సాంకేతిక సమస్యలతో ఎరువుల పంపిణీకి అంతరాయం
- సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి



**జలుమూరు, జులై 19 (వార్త):** జలుమూరు మండలం జోనంకి రైతు సేవా కేంద్రంలో ఆదివారం ఎరువుల పంపిణీ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేపట్టేందుకు అధికారులు ప్రయత్నించినప్పటికీ, సాంకేతిక లోపాల కారణంగా యాప్ పనిచేయకపోవడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఉదయం నుంచే రైతు సేవా కేంద్రానికి చేరుకున్న రైతులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. మండుటెండల్లో మధ్యాహ్నం వరకు నిరీక్షించాల్సి రావడంతో పలువురు రైతులు అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనుల నిమిత్తం అత్యవసరంగా ఎరువులు అవసరమైన సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ ఆలస్యం కావడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి ఎరువులను సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి దారేది?

- రహదారి లేక చిన్నారులు, గర్భిణుల ఇబ్బందులు
- బొద్దాం కేంద్రానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**పోలాకి, జులై 19(వార్త):** బొద్దాం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి సరైన రహదారి లేక చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి దూరంగా నిర్మించిన ఈ అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేందుకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రతిరోజూ అవస్థలు తప్పడం లేదని చెబుతున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వెళ్లే మార్గం పూర్తిగా దెబ్బతినడంతో చిన్నారులు, సిబ్బంది కాలినడకన వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కేంద్రం ముందు వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం కోసం కేంద్రానికి వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్నారుల ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఈ కేంద్రం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అంగన్వాడీ కేంద్రానికి సరైన రహదారి నిర్మించడంతో పాటు నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు, అంగన్వాడీ కేంద్రం లబ్ధిదారులు కోరుతున్నారు. చిన్నారులు, గర్భిణుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




# వంశధార ఎడమ కాలువ గండి పూడ్చివేత

- పూర్తి స్థాయిలో నీటి విడుదల
- ఆయకట్టు ప్రాంతాలకు ఊరట
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన వంశధార అధికారులు

**సారవకోట, జులై 19 (వార్త):** గుమ్మపాడు పంచాయతీ పరిధిలోని అక్కివలస సమీపంలో వంశధార ఎడమ కాలువకు ఏర్పడిన గండిని అధికారులు యుద్ధప్రాతిపదికన పూడ్చివేసి, శనివారం నుంచి పూర్తి స్థాయిలో నీటి విడుదల ప్రారంభించారు. దీంతో కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు ఊరట లభించింది. గత మంగళవారం కాలువ గట్టుకు గండి పడటంతో నీటి సరఫరా నిలిచిపోయి రైతులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న వంశధార ఇంజినీర్లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఇసుక బస్తాలు, మట్టితో గండిని పూడ్చే పనులు చేపట్టారు. నిరంతర పర్యవేక్షణలో మరమ్మతు పనులను పూర్తి చేసి కాలువ గట్టును బలోపేతం చేసిన అనంతరం శనివారం పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతాలకు ఎలాంటి అంతరాయం లేకుండా సాగునీరు అందుతున్నట్లు పేర్కొన్నారు. కాలువ గట్టుకు మళ్లీ గండి పడకుండా అవసరమైన నివారణ చర్యలు చేపడుతున్నామని, కాలువ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అధికారులు వెల్లడించారు. రైతులకు



సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

**శ్రీకాకుళం, జులై 19 (వార్త):** జిల్లాలో ఈ నెల 20 నుంచి 22 వరకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అండర్-17, అండర్-23 విభాగాల్లో బాలురు, బాలికలకు వివిధ క్రీడా అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి.

### పోటీల షెడ్యూల్:

- ఆమదాలవలస నియోజకవర్గం: 20న అండర్-17 విభాగంలో అథ్లెటిక్స్ మినహా అన్ని స్పోర్ట్స్, 21న అండర్-23 విభాగంలో అథ్లెటిక్స్ మినహా అన్ని స్పోర్ట్స్, 22న అండర్-17, అండర్-23 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు. (సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 9440001190)
- ఎచ్చెర్ల నియోజకవర్గం (వేదిక: రణస్థలం): కబడ్డీ, యోగా, బాక్సింగ్, ఖో-ఖో.. 21న వాలీ బాల్, బ్యాడ్మింటన్, చెస్, హాకీ.. 22న అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయి. (ఫోన్ నెంబర్: 9440255255)
- టెక్కలి నియోజకవర్గం (వేదిక: జెడ్పీహెచ్ఎస్, కొరసవాడ): 20న అండర్-17 విభాగానికి అథ్లెటిక్స్ మినహా అన్ని స్పోర్ట్స్, 21న అండర్-23 విభాగానికి అథ్లెటిక్స్ మినహా అన్ని క్రీడలు, 22న రెండు విభాగాలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు. (ఫోన్ నెంబర్: 9441262515)
- పలాస నియోజకవర్గం: 20న బాలురకు కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్, హాకీ.. బాలికలకు ఖో-ఖో, చెస్, బ్యాడ్మింటన్, ఆర్చరీ పోటీలు ఉంటాయి. 21న బాలురకు ఖో-ఖో, చెస్, బ్యాడ్మింటన్, ఆర్చరీ.. బాలికలకు కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్, హాకీ పోటీలు నిర్వహిస్తారు. 22న అండర్-17, అండర్-23 బాలురు, బాలికలకు అథ్లెటిక్స్‌తో పాటు యోగా, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయి. (ఫోన్ నెంబర్: 9492419416)
- పాతపట్నం నియోజకవర్గం: 20న కబడ్డీ, ఖో-ఖో.. 21న బ్యాడ్మింటన్, వాలీబాల్.. 22న అథ్లెటిక్స్, యోగా, చెస్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, బాక్సింగ్ పోటీలు అండర్-17, అండర్-23 బాలురు, బాలికలకు నిర్వహిస్తారు. (ఫోన్ నెంబర్: 9494164246)
- నరసన్నపేట నియోజకవర్గం: 20న అండర్-17, అండర్-23 బాలురకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్.. 21న బాలికలకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్.. 22న బాలురు, బాలికలకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, చెస్, యోగా, ఆర్చరీ పోటీలు ఉంటాయి. (ఫోన్ నెంబర్: 9553878069)
- శ్రీకాకుళం నియోజకవర్గం: 20న అండర్-17 విభాగంలో అథ్లెటిక్స్ మినహా అన్ని స్పోర్ట్స్, 21న అండర్-23 విభాగంలో అథ్లెటిక్స్ మినహా అన్ని స్పోర్ట్స్, 22న అండర్-17, అండర్-23 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు. (ఫోన్ నెంబర్: 9441914214)
- ఇచ్ఛాపురం నియోజకవర్గం: 20న కబడ్డీ, యోగా, బ్యాడ్మింటన్.. 21న ఖో-ఖో, చెస్.. 22న అథ్లెటిక్స్, వాలీబాల్, ఆర్చరీ, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ పోటీలు అండర్-17, అండర్-23 రెండు విభాగాలకు నిర్వహిస్తారు. (ఫోన్ నెంబర్: 9441024555).

పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వయో ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో సంబంధిత పోటీ వేదికలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఆసక్తి గల ప్లేయర్స్ ముందే *https://sports.ap.gov.in* వెబ్‌సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546